RNI REG.NO. TELTEL/2021/83468

# రిపబ్లిక్ హిందుస్థాన్

తెలుగు దినపత్రిక

సోమవారం | 03.11.2025 | హైదరాబాద్ www.republichindustan.in




సోమవారం | 03.11.2025 | హైదరాబాద్ www.republichindustan.in

## రూ.2000 నోట్లపై ఆర్బీఐ కొత్త ప్రకటన

న్యూఢిల్లీ, నవంబర్ 2, రిపబ్లిక్ హిందుస్థాన్ :



(పెద్ద నోట్ల రద్దు తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత విలువైన కరెన్సీగా పరిచయమైన రూ.2000 నోట్లు మళ్లీ వార్తల్లోకి వచ్చాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) తాజాగా విడుదల చేసిన ప్రకటనతో ఈ పెద్ద నోట్లపై మరోసారి చర్చ మొదలైంది.

2016 నవంబర్‌లో జరిగిన నోట్ల రద్దు అనంతరం రూ.2000, రూ.500 నోట్లను ఆర్‌బీఐ చలామణిలోకి తీసుకొచ్చింది. అయితే, ఆ తర్వాత ఈ పెద్ద నోట్ల అవసరం తగ్గిపోవడంతో 2023 మే 19న రూ.2000 నోట్లను చలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బీఐ అధికారికంగా ప్రకటించింది. అప్పటి వరకు మార్కెట్లో దాదాపు రూ.3.56 లక్షల కోట్ల విలువైన రూ.2000 నోట్లు ఉన్నాయని పేర్కొంది.

గడిచిన రెండేళ్లలో ఆ నోట్లు దాదాపు అన్నీ బ్యాంకులకు తిరిగి వచ్చాయి. కానీ తాజాగా విడుదల చేసిన ఆర్‌బీఐ నివేదిక ప్రకారం, ఇప్పటికీ ప్రజల వద్ద రూ.5,817 కోట్ల విలువైన రూ.2000 నోట్లు ఉన్నాయని వెల్లడించింది. అంటే మొత్తం నోట్లలో 98.37 శాతం ఇప్పటికే బ్యాంకింగ్ వ్యవస్థలోకి చేరగా, మిగిలిన 1.63 శాతం నోట్లు ఇంకా మార్కెట్లో, లేదా వ్యక్తుల వద్దే ఉన్నట్లు అర్థమవుతోంది.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఆర్‌బీఐ నోటీసు ఇచ్చిన రెండున్నరేళ్ల తర్వాత కూడా ఈ నోట్లు పూర్తిగా తిరిగి రాకపోవడం. కొందరు ఈ నోట్లు

## భారత గిరిజన సమాజంపై ప్రధాని మోదీకి అపార గౌరవం

– దేశవ్యాప్తంగా ప్రశంసలు

న్యూఢిల్లీ, నవంబర్ 2 :

భారత గిరిజన సమాజంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చూపుతున్న గౌరవం, ప్రేమ దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గిరిజనుల అభ్యున్నతికి, సాంస్కృతిక వారసత్వ సంరక్షణకు ప్రధాని మోదీ తీసుకుంటున్న చర్యలు ఇప్పటివరకు ఎవరూ చూపని స్థాయిలో ఉన్నాయని రాజకీయ వర్గాలు, సామాజిక సంస్థలు ప్రశంసిస్తున్నాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అనేక కీలక కార్యక్రమాలు చేపట్టింది. 'జనజాతి గౌరవ దివస్'ను జాతీయ స్థాయిలో నిర్వహించడం, గిరిజన స్వాతంత్ర్య సమరయోధులకు స్మారకాలను నిర్మించడం, గిరిజన విద్యార్థుల కోసం ప్రత్యేక వసతి గృహాలు, పాఠశాలలు ఏర్పాటు చేయడం వంటి చర్యలు ఆయన గిరిజన సమాజంపై ఉన్న గౌరవాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి.






"గిరిజన సమాజం భారతదేశపు ఆత్మను ప్రతిబింబిస్తుంది. వారి సంప్రదాయాలు, సంస్కృతి, ఆధ్యాత్మికత దేశ గౌరవానికి బలమైన పునాది" అని మోదీ తరచూ పేర్కొంటున్నారు. ఆయన నాయకత్వంలో గిరిజన ప్రాంతాల రహదారులు, విద్య, వైద్య సదుపాయాలు, తాగునీరు వంటి మౌలిక వసతుల అభివృద్ధి వేగంగా కొనసాగుతోంది. ప్రధాని మోదీ చూపుతున్న గిరిజన సమాజ గౌరవం ఇతర నాయకులకు ఆదర్శంగా నిలుస్తోందని, ఆయన దృష్టిలో ప్రతి గిరిజనుడు దేశాభివృద్ధిలో భాగస్వామి అని కేంద్ర మంత్రులు పేర్కొన్నారు. దేశ సాంస్కృతిక వైవిధ్యంలో గిరిజనులు ముఖ్యమైన భాగమని ప్రధాని మోదీ మళ్లీ మళ్లీ స్పష్టం చేస్తున్నారు.

## భారత అంతరిక్ష విజయాలకు మరో మైలురాయి

- ప్రధాని మోదీ అభినందనలు

రిపబ్లిక్ హిందుస్థాన్ ,న్యూఢిల్లీ, నవంబర్ 2 :



భారత అంతరిక్ష రంగం మరో సువర్ణ విజయాన్ని సాధించింది. దేశ అత్యంత భారీ కమ్యూనికేషన్ ఉపగ్రహం సీఎంఎస్–03ను విజయవంతంగా అంతరిక్షంలో ప్రవేశపెట్టినందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)ను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు.
ఈ సందర్భంగా మోదీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ "మన అంతరిక్ష రంగం నిరంతరం దేశ గర్వాన్ని పెంచుతోంది. ఇస్రో శాస్త్రవేత్తల కృషితో భారత్‌లోని అంతరిక్ష రంగం అత్యుత్తమతకు, ఆవిష్కరణలకు ప్రతీకగా నిలిచింది. వారి విజయాలు జాతీయ ప్రగతిని వేగవంతం చేయడంతో పాటు కోట్లాది ప్రజల జీవితాలను శక్తివంతం చేశాయి" అని పేర్కొన్నారు.
సీఎంఎస్–03 ఉపగ్రహం ద్వారా దేశ కమ్యూనికేషన్ వ్యవస్థ మరింత బలపడనుంది. అంతరిక్ష సాంకేతిక రంగంలో భారత్ సాధిస్తున్న దూసుకుపోతున్న పురోగతిపై ప్రపంచ దేశాలు ప్రశంసలు కురిపిస్తున్నాయని ప్రధానమంత్రి అన్నారు.

## NDA సల్ప పత్రం రైతులకు డబుల్ ఆనందం : నరేంద్ర మోడీ

నవాదా, నవంబర్ 2 ):

బీహార్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల వేడిలో రాజకీయ పార్టీల ప్రకటనలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి



నరేంద్ర మోదీ బీహార్‌లోని నవాదా సభలో ప్రసంగిస్తూ, ఎన్డీఏ సకౌల్ప పత్రం రాష్ట్రంలోని రైతులు, పశుపాలకులకు డబుల్



లాభాలు అందిస్తుందని ప్రకటించారు. మోదీ మాట్లాడుతూ.. "బీహార్‌లో నా రైతు, పశుపాలక సోదర సోదరీమణుల కోసం ఎన్డీఏ సాంకల్ప పత్రం రెండు రెట్లు ఆనందం తెచ్చింది. కేంద్రం ఇస్తున్న పీఎం రైతు సన్మాన్ నిధి రూ.6,000కు అదనంగా, రాష్ట్రంలో మళ్లీ సుశాసన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మరో రూ.3,000 అందిస్తాం" అని హామీ ఇచ్చారు.

## సైన్యాన్ని అవమానించిన రేవంత్‌పై కేటీఆర్ మండిపాటు

– "భారత సైన్యానికి క్షమాపణ చెప్పండి"

హైదరాబాద్, రిపబ్లిక్ హిందుస్థాన్ :

భారత సైన్యాన్ని ఎన్నికల వేదికపై అవమానించిన వ్యాఖ్యలతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలకు గురవుతున్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఆగ్రహానికి కారణమవుతుండగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. సైనికుల త్యాగాలను అపహాస్యం చేయడం దేశాన్ని అవమానించినట్లేనని కేటీఆర్ పేర్కొన్నారు. కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ — "భారత సైన్యంలో చేరడం అంటే అపారమైన కష్టపాటు, త్యాగం, దేశభక్తి అవసరం. సరిహద్దుల్లో ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వర్తించే జవాన్ల వల్లే మనం సురక్షితంగా జీవిస్తున్నాం. రాజకీయాలు చేయగలుగుతున్నాం, కుటుంబాలతో జీవితం గడపగలుగుతున్నాం. అలాంటి భారత సైన్యాన్ని ఎన్నికల ర్యాలీలో అవమానించడం రేవంత్ రెడ్డి స్థాయికి తగిన వ్యవహారమే" అని ఘాటుగా ఎద్దేవా చేశారు. అతను మరింతగా విమర్శిస్తూ — "పాకిస్తాన్‌ను పొగడడం, భారత సైన్యాన్ని తక్కువ చేయడం అనే మాటలు నీచమైనవే. రేవంత్ రెడ్డి వెంటనే భారత సైన్యానికి క్షమాపణ చెప్పాలి. ఒక



రాష్ట్ర ముఖ్యమంత్రి అవతారంలో కనీస బాధ్యత, మర్యాద ఉండాలి. డబ్బు సంచులు పట్టుబడిన వ్యక్తి గూండాలను గౌరవించడం సహజమే కానీ దేశాన్ని కించపరచడం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించలేము" అని వ్యాఖ్యానించారు. కేటీఆర్ స్పష్టంగా పేర్కొంటూ — "ప్రజల మనసుల్లో సైన్యం పట్ల ఉన్న గౌరవం అపారమైంది. ఆ గౌరవాన్ని దెబ్బతీసే నాయకులను ప్రజలు క్షమించరు. దేశం కోసం ప్రాణాలు అర్పించే సైనికులను అవమానించే హక్కు ఎవరికీ లేదు" అన్నారు. ఇక సామాజిక మాధ్యమాల్లో కూడా హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్

## వాట్సాప్ మెసేజ్‌తో కుప్పకూలిన వ్యక్తి

– రూ.22 కోట్ల ట్యాక్స్ నోటీసు!

న్యూఢిల్లీ, నవంబర్ 2 :

నేటి కాలంలో వాట్సాప్ మన జీవితంలో అంతర్భాగమైపోయింది. స్నేహితులు, బంధువులు, సహచరులతో రోజు వందలాది మెసేజ్‌లు పంపించుకోవడం సహజమే. కానీ ఒక వ్యక్తికి మాత్రం ఆ వాట్సాప్ చాట్‌నే జీవితం మీద దెబ్బతీసింది. ఏకంగా రూ.22 కోట్లకు సంబంధించిన ఇన్‌కమ్ ట్యాక్స్ నోటీసులు అందడంతో షాక్ అయ్యాడు. కారణం – అతని పేరుతో ఉన్న ఒక వాట్సాప్ చాట్!

ఢిల్లీకి చెందిన ఆ వ్యక్తి పేరు ఒక రియల్ ఎస్టేట్ కంపెనీపై ఐటీ దాడుల్లో బయటపడిన మొబైల్ డేటాలో కనిపించింది. అందులో పెట్టుబడులు,

మొదటి పేజీ తరువాయి భాగం

అవుతోంది. వేలాది మంది నెటిజన్లు రేవంత్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "సైన్యం లేకుంటే మన దేశం సురక్షితం కాదు. రాజకీయ నాయకులు మాటలలో సంయమనం పాటించాలి" అని డిమాండ్ చేస్తున్నారు. కేటీఆర్ వ్యాఖ్యలతో ఈ వివాదం మరింత వేడెక్కింది. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఇప్పుడు రాజకీయ వర్గాలనే కాదు, ప్రజాసమాజం కూడా కఠిన స్పందన చూపిస్తోంది. దేశభక్తిని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకునే ప్రయత్నాలు ఇక భరించబోమని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు.

---

మొదటి పేజీ తరువాయి భాగం

అనుకోకుండా ఇళ్లలో ఉంచి మర్చిపోయి ఉండవచ్చు, మరికొందరు స్మారకంగా దాచుకున్నట్లు సమాచారం.

ఇంకా ఈ నోట్లు మీ దగ్గర ఉన్నట్లయితే ఆందోళన అవసరం లేదు. రిజర్వ్ బ్యాంక్ స్పష్టంగా తెలిపింది – రూ.2000 నోట్లను ఇప్పటికీ మార్చుకునే అవకాశం ఉంది. అందుకోసం మీరు హైదరాబాద్‌లోని ఆర్‌బీఐ కార్యాలయం లేదా సమీప రిజర్వ్ బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించవచ్చు. నోట్లను సమర్పిస్తే, అంతకు సమానమైన మొత్తం మీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అవుతుంది.

అదే కాకుండా, స్పీడ్ పోస్ట్ ద్వారా కూడా ఈ నోట్లు పంపి మార్పిడి చేసుకునే అవకాశం ఉందని ఆర్‌బీఐ వెల్లడించింది. ఈ ప్రక్రియ పూర్తిగా సురక్షితమని, డబ్బులు మీ ఖాతాలోనే జమ అవుతాయని అధికారులు తెలిపారు.

ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం, పెద్ద నోట్ల చలామణి తగ్గడం ద్రవ్యప్రసరణ నియంత్రణకు దోహదం చేస్తుందని చెబుతున్నారు. అయినా కూడా, ప్రజల వద్ద ఇంకా వేల కోట్ల రూపాయల విలువైన రూ.2000 నోట్లు ఉండటం ఆర్థిక వ్యవస్థలో ఆశ్చర్యకర అంశంగా మారింది.

దేశవ్యాప్తంగా మళ్లీ రూ.2000 నోట్లపై చర్చ మొదలవగా, ఆర్‌బీఐ తాజా గణాంకాలు చర్చనీయాంశమయ్యాయి.

---

మొదటి పేజీ తరువాయి భాగం




ఇదిలా ఉండగా, బీహార్ ఎన్నికల్లో దేశంలోనే అత్యంత అవినీతిపరులైన రెండు కుటుంబాల మధ్య ఘర్షణ మొదలైందని, కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రతి బూత్‌లో ఆర్జేడీని ఓడించాలని సంకల్పించిందని మోదీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.
నవాదా జనసభలో విపరీతమైన జనసంద్రం హాజరై మోదీకి మద్దతు తెలిపింది. ఈ సందర్భంలో ఆయన "బీహార్ ప్రజలు మళ్లీ సుశాసన ప్రభుత్వం రావాలని మనసారా కోరుకుంటున్నారు. మీ ఆశీర్వాదం మాకు బలం ఇస్తుంది" అని అన్నారు.
రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, మోదీ చేసిన ఈ హామీ, రైతు సంక్షేమ వాగ్దానం ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతున్నారు.

---

మొదటి పేజీ తరువాయి భాగం

వడ్డీలు, 'రిటర్న్స్ స్కీమ్'కు సంబంధించిన వివరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ చాట్ ఆధారంగా సదరు వ్యక్తి రూ.22 కోట్లు పెట్టుబడి పెట్టారని భావించిన ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖ ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 153C, 69 కింద నోటీసులు జారీ చేసింది.

అయితే ఆ వ్యక్తి ఈ ఆరోపణలను ఖండిస్తూ — "వాట్సాప్ చాట్ నా ఫోన్ నుంచి కాదు, ఇతరుల నుంచి తీసుకున్న డేటా మాత్రమే. ఇది ఎలాంటి చట్టపరమైన సాక్ష్యం కాదు" అని వాదించాడు. కేసు చివరకు ఢిల్లీ ఇన్‌కమ్ ట్యాక్స్ అప్పీలేట్ ట్రిబ్యునల్ వద్దకు వెళ్లింది.

దర్యాప్తులో ట్రిబ్యునల్ కీలక వ్యాఖ్యలు చేసింది. "డిజిటల్ డేటా లేదా వాట్సాప్ చాట్‌లు మాత్రమే సాక్ష్యాలు కావు. వాటికి మద్దతుగా ఒప్పందాలు, పత్రాలు ఉండాలి" అని స్పష్టం చేసింది. ఎన్వలప్‌లలో ఉన్న పేర్లు స్పష్టంగా లేకపోవడంతో కేసును కొట్టివేసింది.

దీంతో ఆ వ్యక్తి ఊపిరిపీల్చుకున్నాడు. అయితే ఈ ఘటన ఒక హెచ్చరికగా మారింది — "వాట్సాప్‌లో ఏమి రాస్తున్నామో జాగ్రత్త.. అవి కోర్టులోనూ సమస్యలు తెచ్చిపెట్టవచ్చు!"

---

# త్వరలో కొత్త ప్రీమియం స్మార్ట్‌ఫోన్!

న్యూఢిల్లీ, నవంబర్ 2 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): ప్రపంచ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో అగ్రగామి స్థానాన్ని సొంతం చేసుకున్న షియామీ సంస్థ నుంచి మరో సరికొత్త ప్రీమియం ఫోన్ భారత వినియోగదారుల ముందుకు రానుంది. అత్యాధునిక ఫీచర్లు, ఆకర్షణీయమైన డిజైన్‌తో కూడిన ఈ ఫోన్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.
షియామీ సంస్థ తాజాగా చైనాలో విడుదల చేసిన "షియామీ 17" సిరీస్‌లోని ఫోన్లు మంచి ఆదరణ పొందుతున్నాయి.
ఇందులో షియామీ 17, షియామీ 17 ప్రో, షియామీ 17 ప్రో మాక్స్ మోడళ్లు ఉన్నాయి. ఈ సిరీస్‌లో టాప్ మోడల్‌గా ఉన్న షియామీ 17 ప్రో మాక్స్ ఫోన్‌ను త్వరలో భారత మార్కెట్‌లోకి కూడా విడుదల చేయనున్నారు. ఈ స్మార్ట్‌ఫోన్‌లో అత్యాధునిక సాంకేతికతతో కూడిన ప్రాసెసర్, పెద్ద బ్యాటరీ సామర్థ్యం, వేగవంతమైన చార్జింగ్, రెండు డిస్‌ప్లేలతో కూడిన వినూత్న డిజైన్ ఉండనుంది.



**ప్రధాన ఫీచర్లు**

6.9 అంగుళాల ప్రైమరీ డిస్‌ప్లే, 2.9 అంగుళాల సెకండరీ డిస్‌ప్లేతో ఆకర్షణీయమైన లుక్
HDR 10 ప్లస్ సపోర్ట్‌తో కూడిన అధిక నాణ్యతా విజువల్ అనుభవం
నీరు, దుమ్ము నిరోధకత కలిగిన డిజైన్ (IP68/IP69)
తాజా ఆండ్రాయిడ్ 16 ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారంగా కొత్త హైపర్ ఓఎస్ 3.0
50 మెగా పిక్సెల్ మెయిన్ కెమెరాతో పాటు ట్రిపుల్ కెమెరా సెట్‌అప్
50 మెగా పిక్సెల్ ఫ్రంట్ కెమెరాతో స్పష్టమైన సెల్ఫీలు
7500 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం, 100 వాట్ల వేగవంతమైన చార్జింగ్
50 వాట్ల వైర్‌లెస్ చార్జింగ్ సదుపాయం
డ్యూయల్ డిస్‌ప్లే టెక్నాలజీతో భిన్నమైన యూజర్ అనుభవం
ధరల విషయానికొస్తే, షియామీ 17 ప్రో మాక్స్ బేస్ మోడల్ సుమారు రూ.75,000 నుండి ప్రారంభం కానుందని అంచనా. అధిక ర్యామ్, స్టోరేజ్ ఉన్న మోడళ్ల ధర రూ.79,000 నుంచి రూ.87,000 వరకు ఉండవచ్చని సమాచారం.
ప్రస్తుతం షియామీ సంస్థ భారత మార్కెట్‌లో తన కొత్త సిరీస్ ఫోన్ల విడుదలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేస్తోంది. వినియోగదారుల ఆశలు తీరుస్తుందా? అనే ప్రశ్నకు సమాధానం త్వరలోనే రానుంది.

---

# వచ్చే వారం ఫోకస్ చేయాల్సిన 2 పీఎస్యూ స్టాక్స్!

ముంబై, నవంబర్ 2 :
ప్రముఖ దలాల్ స్ట్రీట్ బ్రోకరేజ్ సంస్థ ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌కు చెందిన సాంకేతిక విశ్లేషకుడు



దర్మేశ్ షా, వచ్చే వారం పెట్టుబడిదారులు దృష్టి పెట్టాల్సిన రెండు లార్జ్ క్యాప్ పబ్లిక్ సెక్టార్ కంపెనీలను సూచించారు. ఈ రెండు పీఎస్యూ షేర్లకు కొనుగోలు సూచనతో పాటు లక్ష్య ధర, నష్టనివారణ ధరలను కూడా ప్రకటించారు. ఈ షేర్లలో పెట్టుబడి పెట్టడం లాభదాయకమవుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.
ఈ జాబితాలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉన్నాయి.
ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్
దర్మేశ్ షా ప్రకారం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ షేరుకు రూ.179 లక్ష్య ధర, రూ.154 నష్టనివారణ ధర సూచించారు.
శుక్రవారం ముగిసిన మార్కెట్ లావాదేవీలలో ఈ షేరు 1.68 శాతం పెరిగి రూ.166.25 వద్ద ముగిసింది.
52 వారాల గరిష్ఠ ధర రూ.167.10, కనిష్ఠ ధర రూ.110.72గా నమోదైంది.
గత ఏడాదిలో ఈ కంపెనీ షేరు 20 శాతం లాభాన్ని వాటాదారులకు అందించింది.
ప్రస్తుతం ఈ సంస్థ మార్కెట్ విలువ రూ.2.34 లక్షల కోట్లుగా ఉంది.
భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్
ఈ షేరుకు దర్మేశ్ షా రూ.466 లక్ష్య ధర, రూ.398 నష్టనివారణ ధర సూచించారు.
శుక్రవారం మార్కెట్ ముగిసే సమయానికి ఈ షేరు 3.98 శాతం పెరిగి రూ.426.20 వద్ద నిలిచింది.
52 వారాల గరిష్ఠ ధర రూ.436, కనిష్ఠ ధర రూ.240.25గా ఉంది.
గత ఏడాదిలో ఈ కంపెనీ షేరు 50 శాతం లాభాన్ని వాటాదారులకు అందించింది.
ప్రస్తుతం మార్కెట్ విలువ రూ.3.12 లక్షల కోట్లుగా ఉంది.
దర్మేశ్ షా వ్యాఖ్యానిస్తూ — "ఈ రెండు పీఎస్యూ సంస్థల షేర్లు సాంకేతికంగా బలమైన స్థితిలో ఉన్నాయి. దీర్ఘకాలిక పెట్టుబడిదారులు వీటిని పరిశీలించవచ్చు. వచ్చే వారాల్లో మంచి లాభాల అవకాశముంది" అన్నారు.
రాబోయే వారం మార్కెట్లో పెట్టుబడిదారుల దృష్టి ఈ రెండు లార్జ్ క్యాప్ పీఎస్యూ షేర్లపైనే కేంద్రీకృతం కానుంది.

---

# సీడీఎస్ఎల్ లాభం క్షీణం..

ముంబై, నవంబర్ 2 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):
దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న సెక్యూరిటీల డిపాజిటరీ సంస్థ సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ (సీడీఎస్ఎల్) తాజాగా విడుదల చేసిన రెండవ త్రైమాసిక ఫలితాలు మార్కెట్‌లో చర్చనీయాంశంగా మారాయి. ఈ ఫలితాల ప్రభావంతో సీడీఎస్ఎల్ షేర్లు రేపటి ట్రేడింగ్ సెషన్‌లో పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించే అవకాశం ఉందని విశ్లేషకులు




భావిస్తున్నారు. గత ఆరు నెలల కాలంలో సీడీఎస్ఎల్ షేరు దాదాపు 20 శాతం వరకు లాభాన్ని అందించగా, తాజాగా లాభాల్లో వచ్చిన స్వల్ప తగ్గుదల మార్కెట్ సెంటిమెంట్‌పై కొంత ప్రభావం చూపే అవకాశం ఉంది.

రెండవ త్రైమాసిక ఫలితాల వివరాలు : 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సెప్టెంబర్‌తో ముగిసిన రెండవ త్రైమాసికంలో సీడీఎస్ఎల్ నికర లాభం 13.6 శాతం క్షీణించి రూ.140.21 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.162.20 కోట్లు కాగా, ఈసారి లాభం తగ్గడం కంపెనీకి స్వల్ప ప్రతికూలతగా భావిస్తున్నారు. అలాగే కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం కూడా 1 శాతం తగ్గి రూ.318.89 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఈ ఆదాయం రూ.322.26 కోట్లు.

మార్కెట్‌లో షేర్ ప్రదర్శన : శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి సీడీఎస్ఎల్ షేరు ధర 1.47 శాతం తగ్గి రూ.1,591 వద్ద ముగిసింది. ఈ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయి రూ.1,989.80 కాగా, కనిష్ఠ స్థాయి రూ.1,047.45గా నమోదైంది. గత ఒక వారం రోజుల్లో షేరు ధర 1 శాతం మేర తగ్గగా, గత నెలలో 7 శాతం లాభాన్ని నమోదు చేసింది. గత ఆరు నెలల్లో 20 శాతం లాభం, ఏడాది కాలంలో 5 శాతం లాభం, ఐదేళ్లలో అద్భుతంగా 585 శాతం లాభాన్ని పెట్టుబడిదారులకు అందించింది.

ప్రస్తుతం ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.33,170 కోట్లుగా ఉంది. లాభాలు తగ్గినప్పటికీ, దీర్ఘకాలిక దృష్టితో పెట్టుబడిదారులు ఇప్పటికీ ఈ షేర్‌పై విశ్వాసం ఉంచుతున్నారని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సంస్థ నేపథ్యం : సీడీఎస్ఎల్ దేశంలో ప్రధాన సెక్యూరిటీల డిపాజిటరీగా ఉన్న సంస్థ. ఇది డీమ్యాట్ ఖాతాల పరంగా భారతదేశంలోనే అగ్రగామిగా ఉంది. ఫిబ్రవరి 2022 నాటికి 60 మిలియన్ యాక్టివ్ ఖాతాలను చేరుకున్న తొలి డిపాజిటరీగా రికార్డు సృష్టించింది. ఫిబ్రవరి 1999లో స్థాపించబడిన ఈ సంస్థ ముంబయిని కేంద్రంగా చేసుకుని తమ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా స్టాక్ మార్కెట్ భాగస్వామ్య సంస్థలతో పాటు అనేక బ్యాంకులతో సీడీఎస్ఎల్ భాగస్వామ్యం కలిగి ఉంది.

2025 జూన్ నాటికి ఈ సంస్థలో 403 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. టెక్నాలజీ ఆధారిత సెక్యూరిటీల నిర్వహణ, డీమ్యాట్ సేవలు, ఇన్వెస్టర్ ప్రొటెక్షన్, డిజిటల్ ఆధారిత లావాదేవీలు వంటి రంగాల్లో సీడీఎస్ఎల్ ప్రముఖ స్థానం సంపాదించింది.

మొత్తం మీద, లాభాల్లో స్వల్ప తగ్గుదల ఉన్నప్పటికీ, సంస్థ స్థిరమైన ఆదాయ ప్రవాహం, బలమైన పెట్టుబడి ప్రాతిపదిక, మరియు డిజిటల్ సేవల విస్తరణతో రాబోయే త్రైమాసికాల్లో మళ్లీ వృద్ధి సాధించే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. రేపటి ట్రేడింగ్‌లో సీడీఎస్ఎల్ షేర్ ప్రవర్తనపై పెట్టుబడిదారులు దృష్టి సారించనున్నారు.

# కేన్ విలియమ్సన్‌కి టీ20లకు గుడ్‌బై

హైదరాబాద్, నవంబర్ 2 స్టార్ క్రికెటర్, న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ టీ20లకు గుడ్‌బై చెప్పాడు. వన్డేలు, టెస్టుల్లో కొనసాగుతానని స్పష్టం చేశాడు. 2011లో జింబాబ్వేపై టీ20ల్లో అడుగుపెట్టిన విలియమ్సన్, మొత్తం 93 మ్యాచ్‌లలో 2,575 పరుగులు చేశాడు. ఇందులో 18 అర్ధశతకాలు ఉన్నాయి. అతని వ్యక్తిగత అత్యధిక స్కోరు 95. చివరి మ్యాచ్‌ను 2024లో ఇంగ్లాండ్‌పై ఆడాడు. కివీస్ తరపున టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. 2021 టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌ను ఫైనల్ వరకు తీసుకెళ్లాడు. అలాగే 2016 ప్రపంచకప్‌లో జట్టును సెమీఫైనల్ దశకు చేర్చడంలో కీలక పాత్ర పోషించాడు. కెప్టెన్‌గా 75 టీ20లకు నాయకత్వం వహించాడు. ఐపీఎల్‌లోనూ కేన్ విలియమ్సన్ తన ప్రత్యేక శైలితో మెరిసాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడాడు. తన టీ20 కెరీర్‌పై సంతృప్తి వ్యక్తం చేసిన విలియమ్సన్, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపాడు.



ఈ ఫార్మాట్ నుంచి తప్పుకోవడానికి ఇదే సరైన సమయమని పేర్కొన్నాడు. "ఇప్పుడు రిటైర్ అవ్వడం ద్వారా టీ20 ప్రపంచకప్ జట్టు కూర్పుపై సెలెక్టర్లకు స్పష్టత వస్తుంది. భవిష్యత్తులో మెకరిక్‌లాంటి యువ క్రికెటర్లకు అవకాశాలు కలుస్తాయి," అని అన్నాడు. మిచెల్ శాంట్నర్‌ను అద్భుతమైన కెప్టెన్‌గా ప్రశంసించాడు.

---




## భారత్-దక్షిణాఫ్రికా పోరు ఎవరిది పైచేయి?

హైదరాబాద్, నవంబర్ 2 : మహిళల వన్డే ప్రపంచ కప్ చివరి దశకు చేరుకుంది. ఫైనల్‌లో భారత-దక్షిణాఫ్రికా జట్లు మరికొద్ది గంట్లో తలపడబోతున్నాయి. నవీ ముంబయిలోని డివై పాటిల్ స్టేడియంలో ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరుగనున్నది. ఇప్పటి వరకు రెండు జట్లు ఐసీసీ వరల్డ్ కప్ టైటిల్‌ను గెలువలేదు. ఈ సారి కొత్త జట్టు చాంపియన్‌గా నిలువబోతున్నది.సెమీస్‌లో బలమైన జట్లను ఓడించి.. సెమీఫైనల్లో రెండు జట్లు కఠినమైన సవాల్‌ను ఎదుర్కొన్నాయి. భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఫైనల్స్‌కు అంత సులభంగా ఏమీ చేరుకోలేదు. సెమీఫైనల్లో దక్షిణాఫ్రికా ఇంగ్లండ్‌తో తలపడగా.. భారత జట్టు ఆస్ట్రేలియాను ఢీకొట్టింది. ఏడుసార్లు చాంపియన్‌గా నిలిచిన ఆస్ట్రేలియా జట్టును ఎదుర్కొంది. ఆసక్తికరంగా గ్రూప్ దశలో ఇంగ్లండ్.. దక్షిణాఫ్రికాను ఓడించినట్లే, ఆస్ట్రేలియా జట్టు గ్రూప్ దశలో భారత్‌ను ఓడించింది. అయినా, భారత్, దక్షిణాఫ్రికా జట్టు మనోధైర్యం కోల్పోకుండా.. ఆ రెండు జట్లను సెమీస్‌లో ఓడించి టైటిల్ మ్యాచ్‌లోకి అడుగుపెట్టాయి. రెండు జట్లు టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచాయి. ప్రపంచకప్‌లో రెండు జట్ల ప్రయాణం.. 2025 మహిళల ప్రపంచ కప్‌లో భారతదేశం, దక్షిణాఫ్రికా ప్రయాణాన్ని చూస్తే.. గ్రూప్ దశలో రెండు జట్లు మంచి ప్రదర్శన ఇచ్చాయి. దక్షిణాఫ్రికా ఏడు మ్యాచ్‌ల్లో 10 పాయింట్లతో మూడవ స్థానంలో నిలిచింది. ఐదు మ్యాచ్‌ల్లో గెలిచి రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఆతిథ్య భారతదేశం ఏడు మ్యాచ్‌ల్లో ఏడు పాయింట్లతో నాల్గవ స్థానంలో నిలిచింది. మూడు మ్యాచుల్లో గెలిచి, మూడింట్లో ఓడి, ఒక డ్రాతో సెమీఫైనల్లో చోటు దక్కించుకుంది. హ్యాట్రిక్ పరాజయాల నుంచి టైటిల్ రేసులోకి.. వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో శ్రీలంకను 59 పరుగుల తేడాతో ఓడించి భారత జట్టు ప్రపంచకప్‌లో శుభారంభం చేసింది. ఆ తర్వాత జరిగిన మ్యాచ్‌లో వారు చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 88 పరుగుల తేడాతో ఓడించారు. వరుసగా రెండు విజయాలు సాధించిన భారత జట్టు ఆ తర్వాత హ్యాట్రిక్ పరాజయాలను చవిచూసింది. దాంతో ప్రపంచకప్‌లో భారత జట్టు ప్రయాణం ముగిసిందనే భావించారు. వాస్తవానికి ఆదివారం ఫైనల్ ఆడనున్న దక్షిణాఫ్రికా జట్టుతో భారత్ మొదట మూడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఆ తర్వాత, ఆస్ట్రేలియా చేతిలో మూడు వికెట్ల తేడాతో, ఇంగ్లాండ్ చేతిలో నాలుగు పరుగుల తేడాతో ఓడిపోయారు. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో విజయం భారత్‌కు చాలా కీలకమైంది. ఈ మ్యాచ్ రెండు జట్లకు వర్చువల్ నాకౌట్ లాంటిది. స్మృతి మంధాన, ప్రతికా రావల్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత జట్టు న్యూజిలాండ్‌కు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో డీఎల్ఎస్ ద్వారా 53 పరుగుల తేడాతో విజయం సాధించి సెమీఫైనల్లోకి చేరుకుంది. ఆ తర్వాత మరో గ్రూప్ దశ మ్యాచ్ బంగ్లాదేశ్‌తో జరిగింది. ఆ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. వరుస ఓటముల నుంచి ఫైనల్ వరకు దక్షిణాఫ్రికా ప్రయాణం.. దక్షిణాఫ్రికాకు ప్రపంచకప్ ఆరంభంలో నిరాశ కలిగించింది. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో పది వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది ప్రొటీస్ జట్టు. అయితే, ఆ తర్వాత జట్టు బలమైన పునరాగమనం చేసి వరుసగా ఐదు మ్యాచ్‌లను గెలుచుకుంది. దక్షిణాఫ్రికా న్యూజిలాండ్‌ను ఆరు వికెట్ల తేడాతో, భారత్‌ను మూడు వికెట్ల తేడాతో, బంగ్లాదేశ్‌ను మూడు వికెట్ల తేడాతో, శ్రీలంకను డీఎల్ఎస్ ద్వారా పది వికెట్ల తేడాతో, పాకిస్తాన్‌ను 150 పరుగుల తేడాతో ఓడించింది. గ్రూప్ దశలోని చివరి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్స్ ఆస్ట్రేలియాతో ఏడు వికెట్ల తేడాతో ఓడిపోయారు. అప్పటికి కూడా ఆ జట్టు ధైర్యం సడలలేదు. సెమీ-ఫైనల్స్‌లో ప్రారంభ మ్యాచ్‌లో దారుణంగా ఓడించిన ఇంగ్లండ్‌ను మట్టికరిపించి ఫైనల్‌కు చేరింది. ప్రపంచ కప్ లో రెండు జట్లు సమానంగా.. మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్, దక్షిణాఫ్రికా జట్టు ఇప్పటి వరకు పోటీపడలేదు. కానీ, మహిళల ప్రపంచ కప్‌లో రెండు జట్లు ఆరుసార్లు తలపడ్డాయి. రెండు జట్లు ఒకదానికొకటి మూడుసార్లు గెలిచాయి. ఈ టోర్నమెంట్ లో రెండుజట్లు సమానంగానే ఉన్నాయి. 1997 లో తొలిసారి రెండు జట్లు తలపడ్డాయి. ఆ మ్యాచ్‌లో టీమిండియా దక్షిణాఫ్రికాను ఐదు వికెట్ల తేడాతో ఓడించింది. ఆ తర్వాత 2000 సంవత్సరంలో కూడా భారత్ ఆధిపత్యం చెలాయించింది. ఎనిమిది వికెట్ల తేడాతో ఆ మ్యాచ్‌లో గెలిచింది. 2005లో కూడా దక్షిణాఫ్రికాను నాలుగు వికెట్ల తేడాతో భారత్ ఓడించింది. మూడు మ్యాచుల్లో భారత్ ఓటమి.. 1997 నుంచి 2005 వరకు జరిగిన మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భారత్ మూడుసార్లు దక్షిణాఫ్రికాను ఓడించింది. 2017 నుంచి 2025 వరకు మ్యాచుల్లో దక్షిణాఫ్రికా పైచేయి సాధించింది. మూడు మ్యాచుల్లో టీమిండియా ఓటమిపాలైంది. 2017లో దక్షిణాఫ్రికా 115 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించగా, 2022లో మూడు వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా వారిని ఓడించింది. ప్రస్తుత వరల్డ్ కప్‌లో గ్రూప్ దశలో దక్షిణాఫ్రికా జట్టు భారత్‌పై విజయం నమోదు చేసింది.

# సెంచరీ మిస్ చేసిన పంత్.. భారత్ 'ఏ' ఘన

ముంబై, నవంబర్ 2 ):

తొలి అనధికారిక టెస్టులో భారత 'ఏ' జట్టు జయభేరి మోగించింది. పునరాగమనం మ్యాచ్‌లో చెలరేగిన రిషభ్ పంత్ (90) దక్షిణాఫ్రికా 'ఏ' బౌలర్లను ఊపిరి తిప్పుకోనివ్వలేదు. సెంచరీను చేజార్చుకున్నా జట్టు విజయానికి పునాది వేశాడు. పంత్ వెనుదిరిగాక మానవ్ సుతార్(20 నాటౌట్), అన్షుల్ కంభోజ్(37 నాటౌట్)లు పట్టుదలగా ఆడి భారత్‌కు 3 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందించారు. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి



దూసుకెళ్లింది.

బెంగళూరులోని సీఈవో మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైన కెప్టెన్ రిషభ్ పంత్ రెండో ఇన్నింగ్స్‌లో మెరుపు హాఫ్ సెంచరీతో చెలరేగాడు. దక్షిణాఫ్రికా బౌలర్లను చిత్తు చేసిన పంత్ 90 పరుగులు చేసి సెంచరీకి చేరువయ్యాడు. చివరి రోజు 156 పరుగులు అవసరమైన వేళ పంత్ ఔటైన తర్వాత సుతార్, కంభోజ్ జోడీ మరో వికెట్ ఇవ్వకుండా విజయం సాధించింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 8 వికెట్లు తీసిన తనుష్ కొటియాన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా ఎంపికయ్యాడు. రెండో అనధికారిక టెస్టు నవంబర్ 6న ప్రారంభం కానుంది.

32కే మూడు వికెట్లు.. సఫారీలు కూలి పోయారు

తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగుల ఆధిక్యంతో మూడో రోజు భారత బౌలర్లు దక్షిణాఫ్రికా 'ఏ' బ్యాటర్లను చిత్తుచేశారు. ఓవర్‌నైట్ స్కోర్ 30/0తో ఆరంభించిన సఫారీ జట్టును తనుష్ కొటియాన్(4/26), అన్షుల్ కంభోజ్(3/39)లు బెంబేలెత్తించారు. వీరిద్దరి విజృంభణతో ఆ జట్టు 199 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్ లెసెగో సెనొక్వనె(37), జుబయిర్ హంజా(37)లు మాత్రమే కొంత ప్రతిఘటించారు.

అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 32 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ రిషభ్ పంత్(90) తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించాడు. ఆయుష్ బదోని(34)తో కలిసి జట్టును గెలుపు దిశగా నడిపించాడు. చివర్లో సుతార్, కంభోజ్ జోడీ గెలుపు కట్టబెట్టింది.

తొలి ఇన్నింగ్స్‌లో కొటియాన్ మెరుపు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో తనుష్ కొటియాన్(4/83), గుర్నూర్ బ్రార్(2/45) బౌలింగ్ దెబ్బకు 309 పరుగులకే ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌లో సాయి సుదర్శన్(32), ఆయుష్ మాత్రే(65)లు తొలి వికెట్‌కు 91 రన్స్ జోడించి శుభారంభం ఇచ్చారు. కానీ స్పిన్నర్ సుబ్రయేన్(5/61) కీలక వికెట్లు తీసి భారత్‌ను కుదిపాడు. గాయం తర్వాత కెప్టెన్‌గా పంత్(17) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగినా, రెండో ఇన్నింగ్స్‌లో తన సత్తా చాటాడు. చివరికి సమిష్టి ప్రదర్శనతో భారత 'ఏ' జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది.

# సుందర్ దంచేశాడు.. సిరీస్ సమం

ముంబై, నవంబర్ 2 :

పొట్టి సిరీస్‌లో భారత జట్టు బోణీ కొట్టింది. గెలవక తప్పని మ్యాచ్‌లో సమిష్టి ప్రదర్శనతో ఆస్ట్రేలియాకు చెక్ పెట్టింది. కంగారూలు నిర్దేశించిన 187 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో టీమిండియా అద్భుతంగా రాణించింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(24), తిలక్ వర్మ(29)లు దూకుడుగా ఆడి పునాది వేశారు. చివర్లో వాషింగ్టన్ సుందర్ (49 నాటౌట్), జితేశ్ శర్మ(22 నాటౌట్) ధనాధన్ ఆడి భారత్‌కు ఘన విజయాన్ని అందించారు. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో మొదటి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. రెండో మ్యాచ్ గెలిచిన ఆస్ట్రేలియాకు సమాధానంగా భారత్ మూడో టీ20లో విజయం సాధించింది. ఇరుజట్లు చెరో విజయంతో 1-1తో సమంగా ఉన్నాయి. ఆసియా కప్ ఛాంపియన్‌గా తొలి టీ20 సిరీస్ ఆడుతున్న టీమిండియా, వ్యూహాత్మకంగా ఆడి సిరీస్‌లో నిలిచింది.

ఎల్లిస్ దెబ్బతీసినా.. సుందర్ దంచేశాడు

మూడో టీ20లో భారత ఇన్నింగ్స్‌ను ఓపెనర్ అభిషేక్ శర్మ (25) సిక్సర్లతో దుమ్మురేపాడు. నాథన్ ఎల్లిస్(3/36) మూడు కీలక వికెట్లు తీయడంతో కంగారూలకు కొంత ఊరట లభించినా, సుందర్ చెలరేగడంతో వారి ఆశలు భగ్నమయ్యాయి. అబాట్ వేసిన 14వ ఓవర్లో వరుసగా 4, 6, 6 బాదిన వాషీ ఇన్నింగ్స్ పటిష్టం చేశాడు. సూర్యకుమార్, తిలక్ ఔటైన తర్వాత అక్షర్ పటేల్(17) సహకరించాడు. చివర్లో సుందర్–జితేశ్ జోడీ మరో వికెట్



ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించింది. 19వ ఓవర్లో జితేశ్ బౌండరీతో భారత్ విజయకేతనం ఎగురవేసింది.

డేవిడ్, స్టోయినిస్ చెలరేగగా

టాస్ ఓడి బౌలింగ్ ఎంచుకున్న భారత్ ఆరంభంలోనే ఆస్ట్రేలియాను ఒత్తిడిలోకి నెట్టింది. అర్షదీప్ సింగ్(3/35) అద్భుతంగా బౌలింగ్ చేస్తూ టాప్ ఆర్డర్‌ను కూలదోశాడు. అయితే టిమ్ డేవిడ్(74), మార్కస్ స్టోయినిస్(64) అర్ధశతకాలతో ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. పెద్ద షాట్లతో విరుచుకపడి జట్టును 186 పరుగుల వరకు తీసుకెళ్లారు. డేవిడ్ ఔటైన తర్వాత స్టోయినిస్ గేర్ మార్చి దూకుడు చూపాడు. మాథ్యూ షార్ట్(26 నాటౌట్)తో కలిసి కంగారూలకు పటిష్ట స్కోర్ అందించాడు. అయినా.. భారత బౌలర్లు ఆ టార్గెట్‌ను చిన్నదిగా మార్చారు.





భారత్, ఆస్ట్రేలియా మధ్య నాలుగో టీ20 నవంబర్ 6న జరగనుంది.

